

వీడని సందిగ్ధం

వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు భవన లీజ్ అంశంపై సందిగ్ధం వీడడం లేదు. ఈ అంశం హైకోర్టు పరిధిలో ఉండడంతో యథాస్థితిని కొనసాగిస్తున్నారు. - 8లో



నూతన ఔషధాలపై పరిశోధించాలి

నూతన ఔషధాలను కనుగొనేలా పరిశోధనలు చేయాలని కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.0⁰ /16.0⁰

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేడు టీఎస్ సీపీఎస్ఈయూ జిల్లాస్థాయి సమావేశం

హన్మకొండ అర్బన్: తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్ సీపీఎస్ఈయూ) జిల్లా విస్తృతస్థాయి సమావేశం బుధవారం నగరంలోని టీజీటీ భవన్‌లో నిర్వహించనున్నట్లు యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కందుల జీవన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల శ్రీకాంత్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 1న యూపీఎస్‌ను అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చివరి తేదీగా నిర్ణయించడంపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.

రుద్రేశ్వరుడికి అన్నపూజ



హన్మకొండ కల్చరల్: రుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల దేవాలయంలో మంగళవారం మహా అన్నపూజ నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ఉదయం 5 గంటల నుంచి ఉత్తిష్ఠ గణపతికి పంచామృతాభిషేకం, శ్రీరుద్రేశ్వరస్వామి వారికి రుద్రాభిషేకం, లింగార్చన, షోడశోపచార పూజలు చేశారు. అనంతరం మహాలింగానికి 51 కిలోల పెరుగన్నంతో అన్నసూక్త మంత్రపఠనం, మహాహారతి, నీరాజన మంత్ర పుష్పం నిర్వహించారు.

హనుమకొండ జిల్లాకు 134 మంది స్పౌజ్ టీచర్లు

విద్యారణ్యపురి: వివిధ జిల్లాల నుంచి హనుమకొండ జిల్లాకు 134 మంది టీచర్లను స్పౌజ్ కేటగిరీలో కేటాయించారు. ఇందుకు సంబంధించిన జాబితా డీఈఓకు అందింది. ఆయా టీచర్లు తాము ఇప్పుడు పనిచేస్తున్న జిల్లాల్లోని పాఠశాలల నుంచి రిలీవ్ అయి హనుమకొండ జిల్లాకు రావాల్సి ఉంటుంది. ఇక్కడ ఏ కేడర్‌లోని టీచర్లు ఎంతమందిని కేటాయించారో ఆయా టీచర్ల స్పౌజ్ కేటగిరీకి సంబంధించిన వాటిని పరిశీలిస్తారు. హనుమకొండ జిల్లాలో రిపోర్టు చేశాక వారికి సంబంధించిన పలు ధ్రువపత్రాలు పరిశీలించి ఏ కేడర్‌కు సంబంధించిన టీచర్లను ఆ కేడర్‌లో సీనియారిటీ ఆధారంగా క్లియర్ వేకెన్సీల్లో కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహించి పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వనున్నారు.

సివిల్ సర్వీస్ టోర్నమెంట్‌కు 13 మంది ఎంపిక

వరంగల్: హైదరాబాద్‌లో ఈనెల 23, 24వ తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్‌లో వరంగల్ జిల్లా నుంచి పాల్గొనడానికి 13 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు డీవైఎస్‌ఓ టీవీఎల్ సత్యవాణి మంగళవారం తెలిపారు. వారి ఎలిజిబిలిటీని తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థకు పంపించినట్లు ఆమె పేర్కొన్నారు. ఓ సిటీ స్టేడియంలో మంగళవారం ఎంపికలు నిర్వహించామని, ఎంపికైన క్రీడాకారులు తమ క్రీడాంశాల్లో రాష్ట్ర విజేతలుగా నిలిచి వరంగల్ జిల్లాకు పేరు తేవాలని కోరారు.

'మల్టీ లెవెల్ మార్కెటింగ్'పై అప్రమత్తంగా ఉండాలి



వరంగల్ క్రైం: మోసపూరిత వాగ్దానాలు, ప్రకటనలతో మోసాలకు పాల్పడుతున్న మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీంలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. ప్రజల సొమ్ము దోచుకునేందుకు సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ కొత్త పోకడలతో మోసాలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీంలతో పాటు పిరమిడ్ లాంటి స్కీంల ద్వారా ప్రజల నుంచి డబ్బు దోచేస్తున్నారని తెలిపారు. ఈ స్కీంల ప్రధాన లక్ష్యం విలాసవంతమైన వస్తువులు అందజేస్తామని, సొంతింటి కలను నెరవేరుస్తామని, విదేశీ యాత్రలకు పంపిస్తామని చెబుతుంటారని వివరించారు. సైబర్ నేరగాళ్లు మొదటగా కొంత రుసుముతో ప్రాథమిక సభ్యత్వం కల్పిస్తారని తెలిపారు. ఎక్కువ మొత్తం పెట్టిన పెట్టుబడికి రెట్టింపు వస్తుందని, ఎక్కువ మొత్తంలో సభ్యులను చేర్పిస్తే పెద్ద మొత్తంగా డబ్బు వస్తుందని మభ్యపెడుతూ రూ.కోట్లలో డబ్బు కొల్లగొట్ట డం ఈ మల్టీ లెవెల్ స్కీంల ప్రధాన లక్ష్యమని వివరించారు. ఇలాంటి స్కీంల ద్వారా మోసపోయినట్లుగా భావిస్తే తక్షణమే 1930 టోల్ ఫ్రీనంబర్‌కుగానీ, లేదా https://www. cybercrime.gov.in అనే వెబ్‌సైట్‌లో, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.



సారూ.. పింఛన్ రావడం లేదు..

వార్డు సభలో సీపీకి వృద్ధురాలి వినతి

రామన్నపేట : వరంగల్ నగరంలోని 22వ డివిజన్‌లో మంగళవారం జరిగిన వార్డుసభకు మున్సిపల్ కమిషనర్ తానాజీ వాకడేతోపాటు సీపీ అంబర్ కిషోర్ ఝా హాజరయ్యారు. సభకు హాజరైన ఓ వృద్ధురాలితో సీపీ మాటామంతి కలిపారు. 'సారూ..నాకు పింఛన్ రావడం లేదు' అని ఆ వృద్ధురాలు తెలపడంతో సీపీ స్పందించి ఆమెనుంచి వినతిపత్రాన్ని నేరుగా తనే తీసుకుని సంబంధిత అధికారులకు అందించారు.

నా పేరు లేకపాయె?

అయ్యో... రామా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలా..?

- ఒక్క పథకం కోసం ఎన్ని సార్లు అర్జీలు అందించాలి..?
- మొదటి రోజు వార్డుసభల్లో అధికారులను ప్రశ్నించిన ప్రజలు
- జనంతో కిటకిటలాడిన కేంద్రాలు
- జాబితాలపై అభ్యంతరాలు అంతంతే..





22వ డివిజన్ వార్డుసభలో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ, హాజరైన ప్రజలు

వరంగల్ అర్బన్ : 'అయ్యో రామా.. మళ్లీ మా పేర్లు లేకపాయె'. ఒక్క పథకం కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలి' అంటూ... నగరంలోని పలు డివిజన్లలో మంగళవారం జరిగిన వార్డు సభల్లో ప్రజలు నిరసన వ్యక్తం చేస్తూ మళ్లీ దరఖాస్తులను అందజేశారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా లబ్ధిదారుల జాబితాల ప్రదర్శన, అభ్యంతరాల స్వీకరణ, ఎంపిక కోసం ఏర్పాటు చేసిన సభలు మొదటిరోజు ఆగమాగంగా మారాయి. ప్రజలతో కిటకిటలాడాయి. లిస్టులో పేర్లు లేకపోవడంతో అన్ని అర్హతలున్నా తమ పేర్లు గల్లంతయ్యాయని సిబ్బందిని నిలదీశారు. గంటల తరబడి క్యూ లైన్లలో నిలబడి పత్రాలను సమర్పించారు. గత ఏడాది ప్రజాపాలనలో దరఖాస్తుల చేసుకున్నా, అవి బల్దియా సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్ల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణాలోపం కారణంగా డేటా ఎంట్రీ చేయలేదు. దరఖాస్తులు నమోదు చేసిన కొందరికి గ్యాస్ కనెక్షన్, రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్ల జాబితాల్లో ఎంట్రీలో కొన్ని తప్పిదాలు దొర్లాయి. దీంతో ఆర్నెళ్లుగా బల్దియా ప్రధాన కార్యాలయంలో రెండోసారి దరఖాస్తులు సమర్పించినా.. ప్రభుత్వం కొత్తగా ఎంట్రీ, ఎడిట్ ఆప్షన్ ఇవ్వలేదు.ఈ క్రమంలో మరో మారు కొత్తగా దరఖాస్తులను అందజేశారు.



సొంతింటి కల నెరవేరుతుంది

కాజీపేట రూరల్: ప్రజాపాలన వార్డు సభలో ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నా. కాంగ్రెస్ పాలనలో ఇందిరమ్మ ఇల్లు వస్తే ఎంతో కాలం నుంచి ఎదురు చూస్తున్న సొంతింటి కల నెరవేరుతుంది. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి. - **కొక్కంటి శరత్, 47వ డివిజన్**

తొలిరోజు దరఖాస్తులు ఇలా	వార్డుసభలు 20	ఇందిరమ్మ ఇళ్లు 2,687	రేషన్‌కార్డులు 5,908



లబ్ధిదారులను ఎలా ఎంపిక చేస్తారు?

నాగారంలో కలెక్టర్‌ను ప్రశ్నించిన ప్రజలు

నాగారంలో కలెక్టర్ ప్రావీణ్యను ప్రశ్నిస్తున్న స్థానికులు

హసన్‌పర్తి: ముసాయిదా జాబితాను ప్రదర్శించడం సరే.. లబ్ధిదారులను ఎలా ఎంపిక చేస్తారని కలెక్టర్ ప్రావీణ్యను నాగారం గ్రామస్తులు ప్రశ్నించారు. 1,100 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు, అందరు అర్హులేనని ముసాయిదా జాబితా విడుదల చేశారు. ఇందిరమ్మ ఇళ్లు ఎన్ని మంజూరయ్యాయని అడిగారు. గ్రామంలో మంగళవారం జరిగిన గ్రామ సభలో కలెక్టర్ ప్రావీణ్య పాల్గొన్నారు. పథకాలకు సంబంధించిన ముసాయిదా జాబితాను విడుదల చేశారు. జాబితాలో పేర్లు లేని దరఖాస్తుదారులు అసహనం వ్యక్తం చేశారు. అనర్హులకు చోటు కల్పించారని, అర్హుల పేర్లు తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. లబ్ధిదారులను ఏవిధంగా ఎంపిక చేస్తారని కలెక్టర్‌ను మాజీ సర్పంచ్ అరుణ్ అడిగారు.

అర్హులకు సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. నాగారంలో జరిగిన గ్రామ సభలో కలెక్టర్ మాట్లాడుతూ అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. జాబితాలో పేర్లు లేని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఉపాధి హామీ కార్డులు కలిగి ఉండి అర్హులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింపజేస్తామని, ముసాయిదా జాబితాను గ్రామ సభలో ఆమోదించిన తర్వాత లబ్ధిదారులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, డీఎల్‌పీఓ గంగాభవాని, ఎంపీడీఓ కర్ణాకర్‌రెడ్డి, పీపీఓ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వరంగల్ 37వ డివిజన్ తూర్పుకోటలో నగర పాలక సంస్థ, రెవెన్యూ, వ్యవసాయ ఆధ్వర్యంలో గ్రామసభ జరిగింది. అధికారుల సూచనల ప్రకారం రైతు భరోసా కోసం ఆరుగురు, రేషన్ కార్డులు , పిల్లల పేర్ల నమోదు కోసం 409, ఇందిరమ్మ ఇళ్ల కోసం 78 మంది దరఖాస్తులు చేసుకున్నారు. అదేవిధంగా వరంగల్ 40వ డివిజన్ ఉర్సు కరీమాబాద్ సీఆర్‌సీ భవనంలో గ్రామ సభ జరిగింది ప్రధానంగా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం 702, రేషన్ కార్డులు, పిల్లల పేర్ల కోసం 400 మంది ప్రజలు దరఖాస్తు చేశారు. - ఖిలావరంగల్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు

కాజీపేట రూరల్: కాజీపేట 47వ డివిజన్ ఇంపీరియల్ కాలనీలోని కమ్యూనిటీహాల్‌లో మంగళవారం వార్డు సభ నిర్వహించారు. రేషన్‌కార్డులు, ఆధార్‌కార్డులు, ఇళ్లు లేవని పలువురు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం 82 మంది, రేషన్ కార్డులు కోసం 169 మంది దరఖాస్తు చేసుకున్నారు.

రేషన్‌కార్డులో పాప పేరు లేదు



వరంగల్ : పాప పుట్టి పదేళ్లయ్యింది. రేషన్‌కార్డులో ఆమె పేరు నమోదు కోసం అప్లికేషన్ పెట్టాను. నాకు ఇద్దరు అమ్మాయిలు. సొంత ఇల్లు లేదు. ఆర్థిక పరిస్థితి బాగాలేదు. ఇంటి కిరాయి కట్టలేకపోతున్నా. డబుల్ బెడ్‌రూం ఇల్లు కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో అనేకసార్లు దరఖాస్తు పెట్టుకున్నా. ఇంతవరకు రాలేదు. దయచేసి అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పించాలి.

- ఆకుతోట నిర్మల, 40వ డివిజన్

దరఖాస్తుల స్వీకరణ నిరంతరం

- గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

రామన్నపేట: ప్రభుత్వ పథకాల కోసం ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ అని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. నగరంలోని 22వ డివిజన్ ఇన్నర్‌వీల్ కమ్యూనిటీహాల్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన వార్డు సభలో కమిషనర్ పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యంగా వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదన్నారు. దరఖాస్తుదారుల అనుమానాల నివృత్తికి ప్రత్యేకంగా వార్డు సభలు జరిగే ప్రాంతాలు, సర్కిల్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. స్థలం ఉన్నవారు, స్థలం లేనివారు చేసుకున్న ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల జాబితాలను వేర్వేరుగా తయారు చేసినట్లు వివరించారు. క్షేత్రస్థాయిలో దరఖాస్తులను పరిశీలించి అర్హులను ఆయా పథకాలకు ఎంపిక చేస్తామని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రదర్శిస్తున్న జాబితాలో పేర్లు లేనివారు నిరుత్సాహపడాల్సిన పనిలేదని తెలిపారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు నిష్పక్షపాతంగా వ్యవహరించి ప్రజల నుంచి ఏమైనా అభ్యంతరాలు వస్తే పరిశీలించి నిజమైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందేలా సహకరించాలని సూచించారు. కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి, డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, రెవెన్యూ అధికారి షహజాదీ బేగం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విజయ్, సోహైల్, వార్డు ఆఫీసర్ ప్రవంతి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నైపుణ్య అభివృద్ధి కేంద్రం ఏర్పాటుకు చర్యలు

వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్: మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు జిల్లా కేంద్రంలో నైపుణ్య అభివృద్ధి కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 'వీ హబ్'కు చెందిన అధికారులతో జిల్లాలోని మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుటకు చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో 'వీ హబ్' సహకారంతో (స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్) నైపుణ్య అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. మహిళలకు పిలిగిరి ఆర్ట్, లేస్‌ల తయారీ, గుర్రపు డెక్కల ద్వారా వస్త్రాల తయారీ, జొన్నల ద్వారా టీ కప్పుల తయారీ తదితరాలపై శిక్షణ ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, డీఆర్డీఓ కౌసల్యాదేవి, డీపీఓ కల్పన, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, 'వీ హబ్' సంచాలకులు జాహిద్ అక్తర్‌షేక్, సహాయ సంచాలకులు ఊహ, డీపీఎం రేణుక, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



వీ హబ్ అధికారులతో మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ సత్య శారద

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో డీసీపీ రవీందర్‌తో కలిసి అన్ని శాఖల అధికారులతో మంగళవారం వేడుకల ఏర్పాట్లపై కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ నెల 25వ తేదీలోగా ప్రశంసపత్రాల జాబితాలు సిద్ధం చేయాలన్నారు.

గ్రామసభలపై మంత్రుల వీడియో కాన్ఫరెన్స్

వరంగల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నాలుగు సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా మంగళవారం నుంచి గ్రామ, వార్డు సభలు నిర్వహిస్తున్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, ధనసరి సీతక్క, పొన్నం ప్రభాకర్, సీఎస్ శాంతికుమారి హైదరాబాద్ నుంచి పథకాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు సత్య శారద, ప్రావీణ్య, అదనపు కలెక్టర్లు సంధ్యారాణి, వెంకట్‌రెడ్డితో పాటు జిల్లాల్లోని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొని గ్రామ, వార్డు సభల వివరాలను మంత్రులకు వివరించారు.




నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేయాలి: డీఎంహెచ్‌ఓ

వరంగల్: మాతా శిశు సంరక్షణ, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు, వ్యాధి నిరోధక టీకాలు అందిస్తూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేయాలని డీఎంహెచ్‌ఓ సాంబశివరావు అన్నారు. మంగళవారం వరంగల్ గిరిప్రసాద్‌నగర్‌లోని బస్తీ దవాఖానను సందర్శించి సిబ్బందికి ప్రజలకు అందించాల్సిన వైద్యసేవలు, సమయపాలనపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రమిత వ్యాధులు, అసంక్రమిత వ్యాధులు నిర్ధారణ పరీక్షలు చేయించి చికిత్సలు అందించాలన్నారు. మహిళా ఆరోగ్య క్లినిక్, ఆరోగ్యకేంద్రాలు ప్రజల ఆరోగ్య అవసరాల కోసం నిర్మించినట్లు తెలిపారు. వర్ధన్నపేట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మోహన్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి మహిళా (సం)క్రాంతి!

వరంగల్ రీజియన్‌లో 12 రోజులకు వచ్చిన ఆదాయం రూ.30.30 కోట్లు

- అధిక సంఖ్యలో ప్రయాణించిన మహిళలు
- ఈ నెల 9 నుంచి 20 వరకు రద్దీగా ఆర్టీసీ బస్సులు
- ఉచిత ప్రయాణం కంటే టికెట్ ప్రయాణ ఆదాయమే ఎక్కువ..



హన్మకొండ:

సంక్రాంతి పండుగకు ఆర్టీసీలో మహిళా ప్రయాణికులే అధిక సంఖ్యలో ప్రయాణించారు. మహాలక్ష్మి పథకంతో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో మహిళా ప్రయాణికులు అధిక సంఖ్యలో సద్వినియోగం చేసుకున్నారు. వరంగల్ రీజియన్‌లో ఈ నెల 9 నుంచి 20వ తేదీ వరకు 48.64 లక్షల మంది ప్రయాణిస్తే ఇందులో మహిళ ప్రయాణికులు 30.40 లక్షల మంది ఉన్నారు. టికెట్ ద్వారా ప్రయాణించిన వారి సంఖ్య 18.25 లక్షలు మాత్రమే. ఇందులోనూ మహిళా ప్రయాణికులు ఉన్నారు. మొత్తం ప్రయాణికుల్లో 62.5 శాతం మంది ఉచితంగా ప్రయాణించిన వారే. టికెట్ ద్వారా 37.5 శాతం మంది ప్రయాణించారు. సంక్రాంతి పండుగకు విద్యాసంస్థలకు ఈ నెల 11 నుంచి 17 వరకు సెలవులు ఇచ్చారు. 18వ తేదీ ఒక్క రోజు పని దినం ఉన్నప్పటికీ 19వ తేదీ ఆదివారం కావడంతో ఈ నెల 20వ తేదీ ఉదయం వరకు ఆర్టీసీ బస్సులు కిక్కిరిసి నడిచాయి. విద్యాసంస్థలకు సెలవులు 11 నుంచి అయితే ఆర్టీసీ బస్సులకు ఈ నెల 9 నుంచి రద్దీ పెరిగింది.

టికెట్ ఆదాయమే ఎక్కువ..

62.5 శాతం మహిళల ఉచిత ప్రయాణికులకు 47 శాతం ఆదాయం రాగా, 37.5 శాతం టికెట్ ప్రయాణికుల ద్వారా 53 శాతం ఆదాయం వచ్చింది. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనే మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. డీలక్స్, సూపర్ లగ్జరీ, ఏసీ బస్సులతో పోలిస్తే ఈ బస్సుల్లో చార్జీలు తక్కువగా ఉంటాయి. దీంతో ప్రయాణికుల సంఖ్య అధికంగా కనిపించినా ఆదాయం ఆ మేరకు కనిపించలేదు. డీలక్స్, సూపర్ లగ్జరీ, ఏసీ బస్సుల్లో చార్జీలు అధికంగా ఉంటున్నందున ప్రయాణికుల సంఖ్య తక్కువ కనిపించినా ఆదాయం అధికంగా ఉంటుంది.

రీజియన్‌లో 660 ప్రత్యేక బస్సులు

- సంక్రాంతి పండుగకు వరంగల్ రీజియన్‌లో ఆర్టీసీ 660 ప్రత్యేక బస్సులు నడిపింది.
- సంక్రాంతి పండుగకు 12 రోజుల్లో రూ.30,30,01,000 ఆదాయాన్ని రాబట్టుకుంది.
- సాధారణంగా ఆర్టీసీ వరంగల్ రీజియన్‌లో రోజుకు సగటున రూ.2 కోట్ల ఆదాయం వస్తుంది. ఈ 12 రోజుల్లో సగటున రూ.2.52 కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. కిలో మీటరుకు రూ.64.84 ఆర్జించింది.
- ఈ నెల 9 నుంచి 20వ తేదీ వరకు 46.73 లక్షల కిలోమీటర్లు తిరిగి 48.64 లక్షల మందిని వివిధ గమ్యస్థానాలకు చేరవేసింది.
- మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళా ప్రయాణికులకు ఉచిత ప్రయాణం ద్వారా 30.40 లక్షల మందిని చేరవేసింది. రూ.14,29,63,000 ఆదాయం వచ్చింది.
- టికెట్ ద్వారా 18.25 లక్షల మందిని చేరవేయడం ద్వారా రూ.16,00,38,000 ఆదాయం రాబట్టుకుంది.
- మహిళా ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉన్నా.. మొత్తం ఆదాయంలో ఉచిత ప్రయాణం ద్వారా 47 శాతం మాత్రమే ఆదాయం వచ్చింది.
- టికెట్ ప్రయాణికుల ద్వారా 53 శాతం ఆదాయం వచ్చింది.

డిపోల వారీగా ఆదాయం, ప్రయాణికుల వివరాలు (లక్షల్లో)...

డిపో	ఉచితం	ఆదాయం	టికెట్ ప్రయాణం	ఆదాయం
హనుమకొండ	5.58	192.92	2.56	173.95
వరంగల్-1	2.63	112.33	1.97	294.64
వరంగల్-2	2.27	127.76	2.65	388,74
పరకాల	2.98	125.93	1.82	93.21
భూపాలపల్లి	3.22	164.95	1.66	138.83
జనగామ	4.24	214.72	2.23	144.58
మహబూబాబాద్	3.00	136.29	1.46	73.09
నర్సంపేట	3.70	162.03	2.14	134.13
తొర్రూరు	2.78	192.70	1.75	159.21

డిపోల వారీగా వరంగల్ రీజియన్ మొత్తం ఆదాయం... (అన్నీ లక్షల్లో)

డిపో	ప్రయాణికులు	ఆదాయం	తిరిగిన కి.మీ
హనుమకొండ	8.14	366.87	5.90
వరంగల్-1	4.60	406.97	6.52
వరంగల్-2	4.93	516.50	8.51
పరకాల	4.80	219.14	3.40
భూపాలపల్లి	4.88	303.78	4.27
జనగామ	6.47	359.30	5.57
మహబూబాబాద్	4.46	209.38	3.09
నర్సంపేట	5.84	296.16	4.52
తొర్రూరు	4.53	351.91	4.95

పాండురంగారావుకు గవర్నర్ ప్రతిభాపురస్కారం


ప్రొఫెసర్ పాండురంగారావు

హన్మకొండ కల్చరల్ : ప్రాచీన కట్టడాలు, పురాతన ఆలయాలు, చెరువులు, కుంటల పరిరక్షణ, వారసత్వ సంపద కాపాడు కోవాలంటూ అనేక చైతన్య కార్యక్రమాలు నిర్వహించిన జిల్లాకు చెందిన ఇంటాక్ కన్వీనర్, నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ పాండురంగారావు రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ ప్రతిభా పురస్కారానికి –2024కు ఎంపికయ్యారు. గణతంత్రదినోత్సవ సందర్భంగా ఆయన.. గవర్నర్ చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకోనున్నారు. కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కాకతీయ వారసత్వ సంపద, ప్రాచీనకట్టడాలు, చెరువుల పరిరక్షణపై, రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు పొందడానికి పాండురంగారావు విశేష కృషి చేశారు. జిల్లాలో చెరువులు, కుంటలు ఆక్రమణకు గురవుతున్నాయని, నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు చేపడుతున్నారని 2010లో ఉమ్మడి రాష్ట్ర హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీంతో 2012–13లో సుప్రీం కోర్టు కూడా దేశవ్యాప్తంగా చెరువులు, కుంటల పరిరక్షణ కోసం ఫుల్ ట్యాంక్ లెవెల్ (ఎఫ్‌టీఎల్) ఖరారు చేయడం విశేషం. రామజన్మభూమి ఫౌండేషన్స్‌కు కాకతీయ టెక్నాలజీ వాడాలని సూచనలు చేశారు. ఈ మేరకు గవర్నర్ ప్రతిభా పురస్కారాల్లో భాగంగా హెరిటేజ్, కల్చర్ విభాగంలో ఇద్దరిని ఎంపికచేశారు. ఇందులో పాండురంగారావుతో పాటు హైదరాబాద్‌కు చెందిన సంస్కృతి ఫౌండేషన్‌కు చెందిన పీబీ కృష్ణ భారతి పురస్కారం అందుకోనున్నారు.

సాయం చేయడమే నిజమైన దేశసేవ

- రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్య సలహాదారు ఆదిత్యనాథ్ దాస్


మాట్లాడుతున్న ఆదిత్యనాథ్ దాస్

మంగపేట: తోటి వారికి సాయం చేయడమే నిజమైన దేశసేవని 100 ఫర్ 100 స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, రిటైర్డ్ ఐఏఎస్, రాష్ట్ర నీటి పారుదల శాఖ ముఖ్య సలహాదారు ఆదిత్యనాథ్ దాస్ అన్నారు. మంగళవారం 100 ఫర్ 100, నళిని ఫౌండేషన్, రోటరీ క్లబ్ వరంగల్ ఆధ్వర్యంలో మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆదిత్యనాథ్ దాస్ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న సమయంలో 2001 ఫిబ్రవరి 12న ఏటూరునాగారం ఐటీడీఏ పాలకమండలి సమావేశానికి హాజరై తిరిగి వెళ్తున్న క్రమంలో చిన్నబోయినపల్లి సమీపంలో జరిగిన దాడిలో వనదేవతలు సమ్మక్క, సారలమ్మ దయతో ప్రాణంతో బయటపడిన విషయాన్ని గుర్తు చేశారు. అందుకే ఈ ప్రాంతానికి తనవంతు సేవ చేయాలనే దృక్పథంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. నళిని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు విష్ణుకుమార్ శర్మ, వరంగల్ రోటరీక్లబ్ సభ్యుడు కుమారస్వామి, ఎంఈఓ పొదెం మేనక, హెచ్‌ఎం బాలాజీ, చందాభద్రయ్య, శ్రీనివాస్, మద్దెల నాగేశ్వరరావు, మాధురిదేవి, అనసూర్య, సునీత, వీర నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వీడని సందిగ్ధం..

యథాస్థితిలో డీసీసీబీ భవన లీజ్ అంశం

- జేబీఎస్ స్టోన్ క్రషర్‌కు అద్దెకు భవనం.. లీజ్‌దారుకు అనువుగా భవన నిర్మాణానికి ఒప్పందం
- నల్లవెల్లి కన్‌స్ట్రక్షన్‌కు పనులు అప్పగింత
- ఇంతలోనే లీజ్‌పై వివాదం.. నిబంధనలకు విరుద్ధమని డీసీసీబీ పేచీ
- ఒప్పందం మేరకు లీజ్‌కు ఇవ్వాలని జేబీఎస్ స్టోన్ క్రషర్, చేసిన పనికి బిల్లులు చెల్లించాలని హైకోర్టుకు వెళ్లిన నల్లవెల్లి కన్‌స్ట్రక్షన్
- లీజ్‌పై కొనసాగుతున్న విచారణ



హన్మకొండ : వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు భవన లీజ్ అంశంపై సందిగ్ధం వీడడం లేదు. ఈ అంశం హైకోర్టులో విచారణ ఉండడంతో యథాస్థితి కొనసాగుతోంది. భవన నిర్మాణానికి అయిన ఖర్చులను నిర్మాణ సంస్థ నల్లవెల్లి కన్‌స్ట్రక్షన్స్‌కు చెల్లించాలని హైకోర్టు.. వరంగల్ డీసీసీబీని ఆదేశించింది. దీంతో లీజ్ వ్యవహారం కొలిక్కివచ్చి నట్లు అందరు భావించారు. అయితే నల్లవెల్లి కన్‌స్ట్రక్షన్‌కు.. భవనం లీజ్‌కు ఎలాంటి సంబంధం లేదనే విషయం సుస్పష్టం.

అప్పటి పాలకవర్గంపై ఆరోపణలు

ఈ క్రమంలో అప్పటి పాలకవర్గంపై పలు ఆరోపణలు రావడంతో ప్రభుత్వం సహకార శాఖ అదనపు రిజిస్ట్రార్ జి.శ్రీనివాస్‌రావును విచారణ అధికారిగా నియమించింది. శ్రీనివాస్‌రావు బ్యాంకులో అక్రమాలు జరిగాయని, నిబంధనలకు విరుద్ధంగా భవనాన్ని లీజ్‌కు ఇచ్చారని నివేదిక సమర్పించారు. ఫలితంగా డీసీసీబీ భవనం లీజ్ అంశం వివాదాస్పదమైంది. బ్యాంకు ఆస్తులు లీజ్‌కు ఇవ్వొద్దని నిబంధనలున్నాయని, లీజ్‌కు ఇచ్చేది లేదని డీసీసీబీ తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలో అప్పటి వరకు సాగిన భవన నిర్మాణ పనులు నిలిచాయి. దీంతో తమతో ఒప్పందం చేసుకున్న మేరకు లీజ్‌కు ఇవ్వాలని జేబీఎస్ స్టోన్ క్రషర్స్ హైకోర్టుకు వెళ్లింది. దీనిపై డీసీసీబీ కౌంటర్ పిటిషన్ దాఖలు చేయడంతో యథాస్థితిని కొనసాగించాలని హైకోర్టు స్టేటస్‌కో ఇచ్చింది.

బిల్లుల చెల్లింపును సెటిల్ చేసుకోవాలని కోర్టు ఆదేశం

ఇదిలా ఉండగా బిల్లులు చెల్లించకుండా ఈ అంశం కోర్టులో ఉందని డీసీసీబీ తిప్పించుకుంటుండడంతో నల్లవెల్లి కన్‌స్ట్రక్షన్ 2017లో హైకోర్టును ఆశ్రయించగా 2024 మార్చి 4న బిల్లుల చెల్లింపును సెటిల్ చేసుకోవాలని ఆదేశించింది. దీంతో 2024 మార్చి 19న జరిగిన పాలకవర్గ సమావేశంలో బిల్లుల చెల్లింపు సెటిల్ చేసేందుకు ఏడుగురు సభ్యుల (డైరెక్టర్లు)తో కూడిన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ మొత్తం బిల్లు వడ్డీతో కలుపుకుని రెండు వాయిదాల్లో చెల్లించాలని నిర్ణయం తీసుకుంది. మొత్తం రూ.3,23,93,099 చెల్లించేలా 2024 అక్టోబర్ 8న జరిగిన బ్యాంకు పాలక మండలిలో ప్రత్యేక కమిటీ ఇచ్చిన నివేదికను అమలు చేయాలని తీర్మానించింది. ఈ మొత్తాన్ని రెండు వాయిదాల్లో చెల్లించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ తీర్మానాన్ని సోమవారం జరిగిన మహాజన సభలో ప్రవేశ పెట్టి ఆమోదం పొందారు.

25 సంవత్సరాల కాలపరిమితికి లీజ్

హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీబీ స్థలంలో ప్రధాన కార్యాలయం కోసం ఆ బ్యాంకు భవన నిర్మాణం చేపట్టింది. ఇందులో కొంత భవనాన్ని ప్రధాన కార్యాలయానికి, నక్కలగుట్ట బ్రాంచీ కోసం వాడుకుంటుంది. మిగతా భవనం స్కెల్‌టన్‌గా (పిల్లర్లు, పై కప్పుతో) వృథాగా ఉండడంతో అప్పటి పాలక వర్గం 2015 ఫిబ్రవరి 19న లీజ్‌కు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జేబీఎస్ స్టోన్ క్రషర్స్‌కు 25 సంవత్సరాల కాలపరిమితికి లీజ్‌కు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకుంది. ముందు రూ.3 కోట్లు డిపాజిట్ చేయాలని, స్కెల్‌టన్‌గా ఉన్న భవనాన్ని లీజ్‌దారునకు అనువుగా నిర్మించి ఇవ్వాలని డీసీసీబీ ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు నల్లవెల్లి కన్‌స్ట్రక్షన్‌కు భవన నిర్మాణ పనులు అప్పగించింది.

బిల్లుల చెల్లింపుల్లో లేని స్పష్టత

ఈ బిల్లులు ఎప్పటి వరకు చెల్లిస్తారనే అంశంలో స్పష్టత లేదు. ఏఏ వాయిదాల్లో చెల్లిస్తారో చెప్పలేదు. ఈ బిల్లు చెల్లించే వరకూ వివాదం సద్దుమణిగేలా లేదు. దీనికి తోడు జేబీఎస్ స్టోన్ క్రషర్స్ హైకోర్టులో దాఖలు చేసిన కేసు విచారణ కొనసాగుతోంది. దీనిని బట్టి వరంగల్ డీసీసీబీ భవన లీజ్‌పై సందిగ్ధత ఇంకా కొనసాగుతున్నట్లు కనిపిస్తోంది. హైకోర్టు తీర్పు వెలువడితేనే భవన లీజ్ వ్యవహారం కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. అయితే లీజ్‌దారునకు అనుకూలంగా తీర్పు వచ్చినా ఆర్‌బీఐ, బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం ప్రకారం లీజ్ ఇవ్వొద్దనే నిబంధన ప్రతిబంధకంగా మారే అవకాశముంది. దీంతో డీసీసీబీ తిరిగి అప్పీల్‌కు గాని, సుప్రీం కోర్టును గాని ఆశ్రయించే అవకాశం ఉంది.

మళ్లీ నియామకాల లొల్లి?

- వైద్యారోగ్యశాఖలో ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులకు మెరిట్ జాబితా సిద్ధం
- నెల రోజుల్లో ముగియనున్న నోటిఫికేషన్ గడువు
- మెరిట్ జాబితా అభ్యర్థులతో బేరసారాలు



ఎంజీఎం : వైద్యారోగ్యశాఖలో ఏ నియామకం జరిగినా అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని నెలల క్రితం వరంగల్ డీఎంహెచ్‌ఓ పరిధిలో జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో జరిగిన నియామకాల్లో అవకతవకలు జరగడంతో ఏకంగా కలెక్టర్ సత్యశారదదేవి స్వయంగా రంగంలోకి దిగి పారదర్శకంగా చేపట్టారు. ఈ క్రమంలో ప్రస్తుతం హనుమకొండ డీఎంహెచ్‌ఓ పరిధిలో మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ) పోస్టుల నియామకానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. గత ఫిబ్రవరిలో ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారంగా మెరిట్ జాబితా రూపొందించి సుమారు 2 నెలల క్రితం 31 పోస్టులు భర్తీ చేశారు. ప్రస్తుతం మిగతా సుమారు 10 ఖాళీ పోస్టుల భర్తీ క్రమంలో గత నోటిఫికేషన్ మెరిట్ ఆధారంగా జాబితా రూపొందించి కలెక్టర్ అనుమతికి సిద్ధం చేశారు.. ఇదంతా సవ్యంగా జరుగుతుంది అనుకుంటే పొరపాటే.. ఇక్కడే సంబంధిత శాఖ అధికారులు తమ నైపుణ్యం ప్రదర్శిస్తున్నట్లు ఉద్యోగ సంఘాల్లో జోరుగా చర్చసాగుతోంది.

హుటాహుటిన మెరిట్ జాబితా తయారీ..

గత ఫిబ్రవరి నెలలో ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం నియామకాల గడువు ఈ ఫిబ్రవరితో ముగుస్తుంది. ఈ విషయాన్ని గమనించిన వైద్యారోగ్య సిబ్బంది హుటాహుటిన మెరిట్ జాబితా రూపొందించి ఖాళీ పోస్టుల భర్తీకి అడుగులు వేస్తున్నారు. పాత జాబితా ప్రకారం ఎవరికి ఉద్యోగాలు వస్తాయో స్పష్టంగా తెలుసు. ఈ విషయాన్ని గమనించిన సిబ్బంది కొత్త నోటిఫికేషన్ ద్వారా నియామకాలు చేపడితే మెరిట్ అభ్యర్థులు మారుతారనే విషయాన్ని గమనించి పాత నోటిఫికేషన్ మెరిట్‌తోనే ఈ నెలలోనే నియామకాల ప్రక్రియ చేపట్టాలని భావించారు. అనుకున్నదే తడువుగా ఎంపికయ్యే అభ్యర్థుల ద్వారా గట్టుచప్పుడు కాకుండా బేరసారాలు కుదుర్చుకుని ఎంపిక ప్రక్రియ ప్రారంభించినట్లు ఉద్యోగ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. దీనిపై జిల్లా ప్రజాప్రతినిధులు, కలెక్టర్ స్పందించి ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా కొత్త నోటిఫికేషన్ ద్వారా నియామకాలు చేపట్టి న్యాయం చేయాలని అభ్యర్థులు వేడుకుంటున్నారు.

అంతా సవ్యమే కానీ..

కొన్ని నెలల క్రితం హనుమకొండ జిల్లా వైద్యారోగ్య శాఖ పరిధిలో బస్తీ దవాఖానకు ఇద్దరు వైద్యాధికారులను ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేశారు. ఈ ఎంపిక ప్రక్రియ జిల్లా ఉన్నతాధికారుల అనుమతి లేకుండా చేసినట్లు చర్చ సాగింది. అనంతరం ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారులు సదరు అధికారులకు మొట్టికాయలు వేసి అనుమతులిచ్చినట్లు వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో బహిరంగంగానే చర్చించుకున్నారు. ఇలాంటి ఆరోపణలకు వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో తావివ్వకుండా పకడ్బందీ ప్రణాళికతో నియామకాలు చేపట్టి, అవినీతికి పాల్పడిన అధికారులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని అభ్యర్థులు కోరుతున్నారు.

‘ఎస్సార్’లో న్యూజిలాండ్ యూనిఫెస్ట్–25


యూనిఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న దీపక్ గార్గ్

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం అన్నాసాగరంలోని ఎస్సార్ యూనివర్సిటీలో మంగళవారం న్యూజిలాండ్ యూనిఫెస్ట్–25 ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా న్యూజిలాండ్‌లోని ఎనిమిది పబ్లిక్ యూనివర్సిటీల ప్రతినిధులు ఒకే వేదికపై సమావేశమైనట్లు ఎస్సార్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ దీపక్ గార్గ్ తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈకార్యక్రమం ద్వారా విద్యార్థులను గ్లోబల్ ఎక్స్‌పోజర్‌తో సంపన్నంగా తీర్చిదిద్దొచ్చన్నారు. యూనివర్సిటీ బీఎస్సీ (అగ్రికల్చర్) విద్యార్థులు మొదటి రెండేళ్ల కాలంలో క్యాంపస్‌లో విద్యను పూర్తి చేసిన అనంతరం మరో రెండేళ్ల న్యూజిలాండ్‌లోని బటాగో యూనివర్సిటీలో ఫుడ్‌సైన్స్ బీఎస్సీ చదివి పట్టా పొందుతారన్నారు. అనంతరం అంతర్జాతీయ వ్యవహారాల, కార్పొరేట్ ఔట్‌రీచ్ డైరెక్టర్ ప్రీతా చక్రవర్తి మాట్లాడారు. విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో వారి సామర్థ్యాలను విస్తరించడానికి ఈ కార్యక్రమం ప్రేరణాత్మక ముందడుగు అన్నారు. విద్యార్థులకు అంతర్జాతీయ విద్య గురించి నిర్ణయాలు తీసుకునేలా అవగాహన కల్పిస్తామన్నారు. విద్య కోర్సులు, స్కాలర్‌షిప్‌లు, అంతర్జాతీయ విద్యార్థి జీవితంలోని ప్రాథమిక విషయాలపై జరిగిన చర్చలు విద్యార్థుల అకడమిక్ ప్రయాణాన్ని సులభతరం చేస్తాయన్నారు.

తనయుడి మృతి తట్టుకోలేక..

- కుమారుడి పెద్దకర్మ రోజే తల్లి కన్నుమూత
- కొత్తగూడలో ఘటన


యాకమ్మ (ఫైల్)

కొత్తగూడ: కుమారుడి మృతి తట్టుకోలేక మనస్తాపంతో తల్లి కన్నుమూసింది. కుమారుడి దశదిన కర్మ రోజే మృతి చెందింది. ఈ విషాదకర ఘటన మంగళవారం కొత్తగూడలో జరిగింది. మండలకేంద్రానికి చెందిన గట్టి యాకమ్మ(70) పక్షవాతంలో సంవత్సర కాలంగా మంచం పట్టింది. అప్పటి నుంచి కుమారుడు నగేశ్(35) తల్లికి సపర్యాలు చేసేవాడు. ఈ క్రమంలో నగేశ్ అనారోగ్యంతో పది రోజుల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి యాకమ్మ మనోవేదనకు గురవుతోంది. ఈ క్రమంలో నగేశ్ కర్మ చేసేందుకు బంధువులు శ్మశానవాటిక వద్దకు వెళ్లి వచ్చే సరికి మృతి చెందింది. ఈఘటనతో మండలకేంద్రంలో విషాదఛాయలు అలముకున్నాయి. కుమారుడి పెద్ద కర్మ రోజే తల్లి మృతి చెందడం పలువురిని కంట తడి పెట్టించింది.

నూతన ఔషధాలపై పరిశోధించాలి

- రూ.12 కోట్లతో పరిశోధన కేంద్రాల ఏర్పాటు
- కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ తదితరులు

కేయూ క్యాంపస్ : నూతన ఔషధాలను కనుగొనేలా పరిశోధనలు చేయాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కేయూ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో సెనేట్‌హాల్‌లో నిర్వహించిన డ్రగ్ డిస్కవరీ ఇన్నోవేషన్స్ అండ్ డెవలప్‌మెంట్ (డీడీఐడీ–2025) అంశంపై నిర్వహించిన ఒక రోజు అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు.అనంతరం పోస్టర్లు ఆవిష్కరించారు. రూసా నుంచి రూ.12కోట్లతో పరిశోధన కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో విద్యార్థులు విషయ నిపుణుల నుంచి విజ్ఞానాన్ని గ్రహించాలని సూచించారు. ఫార్మసీలోని పరిశోధన ఫలితాలను ఐపీఆర్ ద్వారా నమోదు చేయాలన్నారు. పరిశోధనల పరంగా నూతన ఆవిష్కరణలో నిబద్ధత ఉండాల్సిన అవసరం ఉందన్నారు. నాణ్యమైన పరిశోధనలకు ఫార్మసీలో పరిశోధనలకు ప్రోత్సహిస్తామని తెలిపారు. కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి మాట్లాడుతూ ఫార్మసీలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌తో పరిశోధనల పరంగా రూసా మంజూరు చేసిన ప్రాజెక్టులకు మంచి ఉపయోగమన్నారు. 30వ తేదీన కూడా ఫార్మసీలో జరిగే కాన్ఫరెన్స్ విద్యార్థులకు, అధ్యాపకులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో కేయూ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ప్రవాస భారతీయుడు డాక్టర్ సాంబరెడ్డి, న్యూడ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్‌పై కీలకపోన్యాసం చేశారు. న్యూజెర్సీ సైంటిస్టు డాక్టర్ కార్తీక్ యాదవ్‌జంగా, సీసీఎంబీ సైంటిస్టు ఎస్.దినేష్ , కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ప్రసాద్, యూజీసీ కోఆర్డినేటర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, హైదరాబాద్, వరంగల్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు శివదేవ్, జన్ను కిరణ్, వై.నర్సింహారెడ్డి మాట్లాడారు. పలువురు విషయ నిపుణులు ఫార్మసీ రంగంలో పరిశోధనల గురించి వివరించారు.

బీసీలు ఏకమైతేనే రాజ్యాధికారం

- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

హన్మకొండ చౌరస్తా : బీసీలంతా ఏకమైతేనే రాజ్యాధికారం సాధ్యమని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పేర్కొన్నారు. మంగళవారం బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం ఉమ్మడి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 24వ తేదీన (శుక్రవారం) హరితహోటల్‌లో ‘స్థానిక సంస్థల ఎన్నికలు–బీసీల పాత్ర–రిజర్వేషన్లు’ అనే అంశంపై నిర్వహించే సదస్సుపై హనుమకొండలోని అశోకా కాన్ఫరెన్స్ హాల్‌లో చర్చించారు. డాక్టర్ కూరపాటి రమేశ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి తీన్మార్ మల్లన్న ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీసీలకు దక్కాల్సిన ఫలాలను అగ్రకులాలు హస్తగతం చేసుకున్నాయని వెల్లడించారు. ఇప్పటికైనా బీసీ లంతా ఏకమై వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వు చేసిన సీట్లను మినహాయించి మిగతా వాటిలో పూర్తిగా బీసీ నాయకులే పోటీ చేసి గెలవాలని ఉద్ఘాటించారు. ఈ సమావేశంలో ఫోరం కోఆర్డినేటర్ డాక్టర్ కె.వీరస్వామి, నాయకులు డాక్టర్ సీహెచ్ రాములు, దారం జనార్దన్, సుందర్‌రాజ్ యాదవ్, డాక్టర్ ఎల్.చంద్రమోహన్, కె.వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ పంటక్షేత్రాల పరిశీలన


వేరుశనగ పంట క్షేత్రాన్ని పరిశీలిస్తున్న రాజన్న

మామునూరు : ఒంటిమామిడిపల్లి గ్రామంలో సాగుచేస్తున్న వేరుశనగ పంట క్షేత్రాలను మామునూరు కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న మంగళవారం సందర్శించి, పరిశీలించారు. నూనెగింజ పంట క్షేత్రాల ప్రదర్శన, ప్రాముఖ్యత, నూతన వంగడాల విశిష్టత, ఆధునాతన పరిజ్ఞానంతో పంట సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. రాజిరెడ్డి, దిలీప్, రాజు, కేవీకే సిబ్బంది హర్ష, చందు, శుశ్రుత్ పాల్గొన్నారు.

పాకాల రూపురేఖలు మారుస్తాం

- సీసీఎఫ్ భీమానాయక్
- పాకాలలో అభివృద్ధి పనుల పరిశీలన


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న సీసీఎఫ్

ఖానాపురం : పర్యాటక రంగ అభివృద్ధిలో పాకాల రూపురేఖలు మారుస్తామని సీసీఎఫ్ భీమానాయక్ అన్నారు. ఈ మేరకు మండలంలోని పాకాలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల్లో నాణ్యత, పని విధానాలు పరిశీలించారు. పాకాలలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. నూతనంగా ఏర్పాటు చేసిన బోటింగ్ చేసి పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాకాలలో పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి పనులు చేయనున్నట్లు తెలిపారు. పార్కింగ్ టికెట్ కౌంటర్, బ్యాటరీ వాహనాలు, క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకుల కోసం వాకింగ్ ట్రాక్, సైక్లింగ్, సఫారీ వాహనాలు, నైట్ క్యాంపింగ్ సైట్‌ను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. దశల వారీగా పనులు చేపడుతూ పాకాలను పర్యాటక రంగ అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తామన్నారు. పర్యాటకులు సఫారీ ద్వారా ముసలమ్మ దేవాలయం, భీముని పాదం, పులిమడుగు క్యాంపింగ్ సైట్, చిలుకలగుట్ట అందాలను వీక్షించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. అవసరం మేరకు పనులు చేపడతామన్నారు. పాకాల అందాలు వీక్షించిన పర్యాటకులు మరోసారి వచ్చేలా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వరంగల్, మహబూబాబాద్ డీఎఫ్‌ఓలు అనూజ్ అగర్వాల్, విశాల్, ఎఫ్‌డీఓ చంద్రశేఖర్, ఎఫ్‌ఆర్వో రవికిరణ్, వజహత్, డీఆర్వో రీనా, సెక్షన్, బీట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాజీపేట జంక్షన్‌లో గంజాయి

- ప్లాట్‌ఫాం–1లో బ్యాగును గుర్తించిన పోలీస్ జాగిలం
- స్వాధీనం చేసుకున్న యాంటీ డ్రగ్స్ కంట్రోల్ టీం


పోలీస్ జాగిలం గుర్తించిన గంజాయి బ్యాగును తెరుస్తున్న యాంటీ డ్రగ్స్ కంట్రోల్ అధికారులు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో మంగళవారం గంజాయి బ్యాగు కలకలం సృష్టించింది. ఆగంతకులు రహస్య ప్రదేశంలో దాచిపెట్టిన గంజాయి బ్యాగు పోలీస్ జాగిలానికి చిక్కింది. కాజీపేట పోలీసుల అధికారుల కథనం ప్రకారం.. కాజీపేట రైల్వేస్టేషన్ నుంచి పెద్ద మొత్తంలో గంజాయిని తరలిస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనరేట్ యాంటీ డ్రగ్స్ కంట్రోల్ టీంకు ఉదయం సమాచారం అందింది. వెంటనే యాంటీ డ్రగ్స్ కంట్రోల్ టీం పోలీసులు పోలీసు జాగిలాలతో కాజీపేట రైల్వే స్టేషన్‌కు చేరుకుని ప్రయాణికులతోపాటు అనుమానా స్పద వస్తువులను తనిఖీలు చేశారు. ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం చివర వరంగల్ వైపు రూట్‌లో ప్రయాణికులు కూర్చునే బల్ల కింద రహస్యంగా భద్రపరచిన బ్యాగును జాగిలం గుర్తించి అరిచింది. దీంతో పోలీసులు అప్రమత్తమై బ్యాగును స్వాధీనం చేసుకుని తెరచి చూశారు. అందులో నాలుగు కిలోల గంజాయిని గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ సురేశ్, ఆర్ఐ శివకేశవులు, ఆర్ఎస్సైలు పూర్ణమనోజ్, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

దేశం గర్వపడేలా విజయాలు సాధించాలి

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు


మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న యశ్వంత్

మరిపెడ రూరల్: దేశం గర్వపడేలా విజయాలు సాధించాలని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడిని మరిపెడ మండలం భూక్యతండాకు చెందిన మౌంటైనర్ భూక్య యశ్వంత్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా యశ్వంత్ సాధించిన విజయాల గురించి వెంకయ్యనాయుడు తెలుసుకున్నారు. మారుమూల గిరిజన తండా నుంచి అతి పిన్న వయసులో ఇన్ని విజయాలు సాధించడం అభినందనీయమన్నారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎవరెస్ట్ శిఖరం అధిరోహించాలనే యశ్వంత్ సంకల్పం గొప్పదన్నారు. ప్రభుత్వాలకు యశ్వంత్ లాంటి వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి దేశానికి పేరు తీసుకురావాలని యశ్వంత్‌కు సూచించారు.

నేడు, రేపు ఆర్టీసీ కార్మికుల నిరసన

హన్మకొండ: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు, ఆర్టీసీని ప్రైవేట్, కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెట్టడాన్ని నిరసిస్తూ, విద్యుత్ బస్సుల నిర్వహణ ఆర్టీసీకే అప్పగించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22, 23 తేదీల్లో బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టనున్నట్లు ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ వరంగల్ రీజియన్ అధ్యక్షుడు సీహెచ్.రాంచందర్ తెలిపారు. ఆర్టీసీలో ప్రైవేట్ వ్యక్తులు బస్సులు నిర్వహిస్తే రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 7 వేల ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదముందని ఆయన ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో కార్మిక సంఘాలు సంస్థ ప్రయోజనాల కోసం నడుం బిగించాయని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే రెండు రోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఆర్టీసీ ఉద్యోగి నల్లబ్యాడ్జీ ధరించి నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ విద్యుత్ పథకాల సవరణలు చేయాలని, ఆర్టీసీలే నేరుగా విద్యుత్ బస్సులు కొనుగోలు చేసేలా నిధులు సమకూర్చాలని, కార్పొరేట్ సంస్థలకు ఇస్తున్న రాయితీలు, ఇన్సెంటివ్‌లు ఆర్టీసీకి ఇవ్వాలని, ప్రజల అవసరాల మేరకు బస్సులు పెంచాలని, హరితహారం, నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం కింద నిధులు ఇవ్వాలని, ఎంవీ యాక్ట్–2019ను సవరించాలని ఆయన డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి మృతి


చంద్రారెడ్డి (ఫైల్)

రేగొండ: రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని తిరుమలగిరికి చెందిన గంగుల చంద్రారెడ్డి (56) మండలంలోని నారాయణపురంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో బైక్‌పై మండల కేంద్రం నుంచి తిరుమలగిరికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

రైతుల సమస్యలకు వాట్సాప్‌లో సలహాలు


మాట్లాడుతున్న రామచంద్రమూర్తి

వరంగల్ : వాట్సాప్ గ్రూపుల ద్వారా రైతులకు వివిధ పంటల సాగులో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సలహాలు ఇస్తున్నట్లు ‘ఫాస్’ (ఫౌండేషన్ ఫర్ అగ్రికల్చర్ సస్టేనబిలిటీ ట్రాన్స్‌ఫ్మారేషన్) వేదిక అధ్యక్షుడు రామచంద్రమూర్తి తెలిపారు. మంగళవారం జిల్లా రైతు శిక్షణ సమావేశ మందిరంలో ఫాస్ట్ ఐదేళ్ల విజయోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ‘ఫాస్ట్’ వేదిక ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రైతులకు సందర్భానుసారంగా సలహాలు, సూచనలు చేరవేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వరంగల్ సహ సంచాలకుడు ఉమారెడ్డి, వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ బలరాం, అస్కి ప్రతినిధి హేమనాథరావు, ఫాస్ట్ ప్రతినిధి రామచందర్‌రావు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ గౌస్‌హైదర్, తదితరులు పాల్గొన్నారు.